క్లుప్తంగా

వివధ హక్కుల కోసం నేడు బహిరంగ వేలం

పాకాల : స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆగస్టు 10వ తేదీ నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ, వాహనాల పార్కింగ్, పాద రక్షల భద్రపరుచుకోవడం, కొబ్బరి చిప్పలు సేకరించేందుకు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముందుగా తగిన దరావత్తు మొత్తం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వెల్లడించారు.

ఆర్టీసీ ఆస్పత్రి పనివేళల్లో మార్పులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన ఆస్పత్రిలో పనివేళల్లో మార్పులు చేశారు. గతంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆస్పత్రి అందుబాటులో ఉండేది. ప్రస్తుతం శనివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ విషయాన్ని ఆర్టీసీ ఉద్యోగులు గమనించాలని అధికారులు తెలిపారు.

ఎస్వీ వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ అధికారులకు విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

తిరుమల: ఎస్వీ వేద పరిరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన ఎస్.టి.రంగరాజన్ రూ.10,00,108 విరాళంగా ఇచ్చారు. ఆయన చెక్కును బుధవారం తిరుమలలోని దాతల విభాగం కార్యాలయంలో సూపరింటెండెంట్ ఈశ్వరయ్యకు అందజేశారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఆచార్యులు చక్రవర్తి రాఘవన్ పాల్గొన్నారు.

ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు

బెంగళూరుకు చెందిన పసుపర్తి నరేంద్ర కుటుంబ సభ్యులు బుధవారం ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళంగా ఇచ్చారు. తమ ప్రతినిధి వై.రాఘవేంద్రతో కలిసి టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

సమస్యలపై మంత్రికి వినతి



తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్య, వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని దళిత సంఘం నేతలు కోరారు. వారు బుధవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలు, యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు, దళిత నేతలు వెంకటరమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎంఈవోలకు అభినందనలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి అర్బన్ మండలం ఎంఈఓ-1, ఎంఈఓ-2లుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.బాలాజీ, భాస్కర్ నాయక్‌ను బుధవారం ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స్మా) నాయకులు కలిశారు. వారిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అప్స్మా అధ్యక్షుడు వి.సుబ్రమణ్యం రాజు, కోశాధికారి పి.లోకేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాకాల : మండలంలోని గుడార్లబండ గ్రామానికి చెందిన రాంబాబు(62) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గౌడ సంఘం నాయకులు బుధవారం మృతుని స్వగ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.7,500 సాయం అందజేశారు. కుమార్‌గౌడ్, అల్లూరి శ్రీనివాసులు గౌడ్, వెంకటప్పగౌడ్, వేణుగౌడ్, చెంగల్రాయులు గౌడ్, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

తిరుమలలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

తిరుమల : తనకు సిగరెట్ ఇవ్వకపోతే పాపవినాశనం డ్యామ్‌లో దూకుతానంటూ మతిస్థిమితం లేని వ్యక్తి బుధవారం హల్‌చల్ చేశాడు. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా వల్లూరుకు చెందిన నరేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుమల వచ్చాడు. అతనికి ధూమపానం అలవాటు ఉంది. రెండు రోజులుగా ధూమపానం చేయకపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడు. బుధవారం పాపవినాశనం డ్యామ్ వద్దకు చేరుకుని సిగరెట్ ఇవ్వకపోతే నీటిలో దూకుతానంటూ కుటుంబ సభ్యులను బెదిరించాడు. సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని అతన్ని చాకచక్యంగా పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తెల్లవారకనే పింఛను పంపిణీ

- మురిసిపోతున్న అవ్వాతాతలు
- టీడీపీలో ఇచ్చింది 7,198 పింఛన్లు, వైఎస్సార్‌సీపీ హయాంలో 8,480



ఆస్పత్రిలో పింఛను ఇస్తున్న సచివాలయ సిబ్బంది



వృద్ధురాలికి పింఛను ఇస్తున్న వలంటీర్

పాకాల: ఆదరణ లేని అవ్వాతాతలు, విధి వక్రించిన వితంతువులు, అంగవైకల్యంతో దయనీయ స్థితిలో ఉన్న దివ్యాంగులు, ఒంటరి మహిళలకు సామాజిక పింఛన్లు అందజేస్తూ ప్రభుత్వం చేయూత ఇస్తోంది. అదికూడా ఒకటో తేదీనే తెల్లవారకుండానే వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛను మొత్తాన్ని అందజేస్తుండడంతో పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డయాలసిస్ రోగులు, హెల్త్ పెన్షన్లు, డప్పుడు కళాకారులకు కూడా పింఛన్లు ఇస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

టీడీపీ హయాంలో పింఛను కోసం మైళ్ల దూరం వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చేది. నెలలో ఎప్పుడు ఇస్తారో తెలిసేది కాదు. అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళితే ఆ నెల పింఛను అంతే. మళ్లీ నెల ఇస్తారో లేదో కూడా తెలియని పరిస్థితి. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి తెల్లవారకుండానే పింఛను మొత్తం అందజేస్తున్నారు. టీడీపీ హయాంలో మండలంలో 7,198 మంది పింఛనుదారులు ఉండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 8,480కు చేరింది. గతంలో రూ.78,10,500 ఇస్తుండగా ఇప్పుడు రూ.2,27,34,000 అందజేస్తున్నారు. అది కూడా 1వ తేదీన వలంటీర్ల ద్వారా అందజేయడం విశేషం. ఆస్పత్రిలో ఉన్నా వలంటీర్లు అక్కడికే వెళ్లి ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేలు ముంద్రలు పడని వారికి వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ద్వారా, ఆర్‌బీఎస్ ఫేస్ అథెంటికేషన్ సిస్టమ్ ద్వారా పింఛను అందజేస్తున్నారు. దీంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో...	పింఛన్ల సంఖ్య	నగదు
ఓఏపీ	3,571	38,17,000
నేతన్నలు	24	24,000
వితంతువులు	2,337	25,30,000
అభయహస్తం	270	1,57,000
దివ్యాంగులు	979	12,65,500
కళ్ళుగీత కార్మికులు	10	10,000
ఒంటరి మహిళ	7	7,000
మొత్తం	7,198	78,10,500
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...		
ఓఏపీ	4,956	1,36,29,000
నేతన్నలు	13	35,750
వితంతువఉలు	1,563	42,98,250
అభయహస్తం	558	2,79,000
దివ్యాంగులు	995	29,85,000
కళ్ళగీత కార్మికులు	9	24,750
ఒంటరి మహిళ	103	2,83,250
హెల్త్ పెన్షన్	141	7,10,000
దప్పు కళాకారులు	133	3,99,000
దయాలిసిస్	09	90,000
మొత్తం	8,480	2,27,34,000

ఆనందానికి అవధులు లేవు



గతంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఒకటో తేదీనే నిద్రలేవగానే వలంటీర్ ఇంటి వద్దకు పింఛను అందజేస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛను అందజేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. - విజయ, ఎల్‌బీఎస్ నగర్, పాకాల మండలం

వేలిముద్ర పడకపోయినా సరే..



ముసలి వయసులో ఒక్కోసారి వేలి ముద్రలు సరిగ్గా పడవు. పింఛను ఆపకుండా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ద్వారా మొత్తం అందజేస్తున్నారు. కార్యాలయానికి వెళ్లి తీసుకునే అవసరం లేకుండా నేరుగా ఇంటికే వచ్చి ఇస్తున్నారు. -ఆదెమ్మ, మణిపిరెడ్డిపల్లి, పాకాల మండలం

పింఛన్లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వ సూచనల మేరకు అర్హులైన వారికి పింఛన్లు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి నెలా 1వ తేదీన పింఛనును లబ్ధిదారులకు ఇస్తుంటే వారి ముఖాల్లో సంతోషం కనిపిస్తుంది. వారు ఆశీస్సులు కూడా ఇస్తున్నారు. ఇది ప్రభుత్వం కల్పించిన అవకాశంగా భావిస్తున్నాం. -హేమ, వలంటీర్, పాకాల

త్వరితగతిన ఫ్లోటింగ్ సోలార్ మరమ్మతు పనులు

తిరుపతి తుడా: శ్రీకాళహస్తి సమీపంలోని రామాపురం వద్దనున్న కైలాసగిరి రిజర్వాయర్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం మరమ్మతులకు గురైన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ (నీటిపైన తేలియాడే సోలార్ పలకలు)ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థలో విద్యుత్ అవసరాల కోసం శ్రీకాళహస్తి సమీపంలోని రామాపురం రిజర్వాయర్‌లో స్మార్ట్ సిటీ నిధులతో 4 మెగావాట్ల సామర్థ్యంగల 15,330 పలకలతో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల గాలి, వానకు రిజర్వాయర్‌లో అలల తాకిడి ఎక్కువై సోలార్ పలకలు మరమ్మతులకు గురయ్యాయన్నారు. 2,800 పలకలు పాక్షికంగాను, 200 పలకలు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అలలను నిరోధించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించామన్నారు. అనంతరం కే.పీ.కెనాల్, రామాపురం వాటర్ పంపింగ్ కేంద్రాలను పరిశీలించి నీటి సరఫరాపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మోహన్, ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిదులు పాల్గొన్నారు.

ఏమి చేశాడని ఓట్లు వేయాలి

- చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- ఇన్ని సంక్షేమ పథకాలు అందించడం జగనన్నకే సాధ్యం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 22వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం : రాష్ట్రంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు ప్రజలకు ఏమి చేశాడని ఓట్లు వేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, కార్పొరేటర్ పైడి సునీతతో కలిసి తిరుపతి 22వ డివిజన్ ఎల్ఎస్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మీకు జగనన్న మంచి చేసి ఉంటే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇచ్చి ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ నాయకుడూ చేయలేని విధంగా మేనిఫెస్టోను అమలుచేసిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. ఇక్కడ అమలవుతున్న పథకాలు, వ్యవస్థలను దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలుచేస్తున్నట్టు వివరించారు. చంద్రబాబు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా, జగనన్నపై ఎన్ని విమర్శలు చేసినా, ఎల్లో మీడియా ఎన్ని కట్టుకథలు ప్రచురించినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని తెలిపారు. 14 ఏళ్లలో ప్రజలకు ఒక చిన్న మేలు కూడా చేయని చంద్రబాబు మళ్లీ మోసం చేసేందుకు అబద్ధపు హామీలు ఇస్తున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆరణి సంధ్య, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాముల రమేష్‌రెడ్డి, నైనారు శ్రీనివాసులు, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, మాకం చంద్ర, పైడి చంద్ర, కిరణ్, శివశంకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, సుదర్శన్ రెడ్డి, పడమటి కుమార్, ధనశేఖర్, తిమ్మారెడ్డి, అనీల్, తాలూరి ప్రసాద్, తలారి రాజేంద్ర, కంకనాల రమేష్, నాదముని పాల్గొన్నారు.

అభివృద్ధి ఫలాలు ప్రజలకు అంకితం



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, వాటిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె బుధవారం డిప్యూటీ మేయర్ భూమన అభియన్‌రెడ్డి, అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పూర్తయిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, మాస్టర్ ప్లాన్ రోడ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మార్ పల్లె మాస్టర్ ప్లాన్ రోడ్డు, ఆటోనగర్ మెయిన్ రోడ్, గ్రాండ్ వరల్డ్ రోడ్, 7వ డివిజన్ సచివాలయం, ఎస్వీ మ్యూజిక్ కాలేజ్, టౌన్ క్లబ్, కోర్ట్ మార్గం ఫ్రీ లెఫ్టులు, ఇన్నర్ రోడ్లను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సమావేశంలో ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సంజీవ్ కుమార్, దేవిక, గోమతి, మహేష్, నరేంద్ర పాల్గొన్నారు.

మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు



కొర్లకుంటలో రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కార్పొరేటర్ హనుమంత్ నాయక్‌తో కలిసి 24వ డివిజన్ ఇందిరానగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అలాగే భవానీనగర్‌లో చేపట్టాల్సిన రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయినట్టు అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థను దశలవారీగా మెరుగుపరుస్తామని చెప్పారు. ఇందిరానగర్ సెంటర్లో రాత్రుళ్లు పోలీస్ గస్తీ పెంచాలన్నారు. బండ్లమిట్ట సందులో పాడైపోయిన డ్రైనేజీ వ్యవస్థను త్వరలోనే మార్పు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మునిరామిరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు ఐసీఎస్ రెడ్డి, చందురాయల్, ఉదయ్ వంశీ, గంగులమ్మ, డీఈ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఓటేరులో ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్: ఓటేరు పంచాయతీ అవిలాల లెక్కదాఖలా సర్వే నంబర్ 376 ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. రూరల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, మండల సర్వేయర్ కరుణ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఎనిమిది అక్రమ నిర్మాణాలను తొలగించారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వెనక్కితగ్గారు.

రేపటి నుంచి సుందరరాజ స్వామి వార్షిక అవతార మహోత్సవాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ సుందరరాజస్వామి అవతార మహోత్సవాలు శుక్రవారం నుంచి 9వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో స్వామికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి 6.15 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవ ఉంటాయని వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను రద్దు చేసినట్లు వివరించారు.

యల్లమందలో క్యాన్సర్ పరీక్షలు

భాకరాపేట: క్యాన్సర్‌కు వైద్యం అందుబాటులో ఉందని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్ తెలిపారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద పంచాయతీలో బుధవారం స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఎంపీపీ శివలక్ష్మీ, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ అమర్‌నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య, వైద్యులు నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్ మృతుల కుటుంబాలకు సంఘీభావ ర్యాలీ



శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘం నేతలు, పెద్దలు

తిరుపతి కల్చరల్: మణిపూర్‌లో మృతి చెందిన క్రైస్తవ కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ బుధవారం సాయంత్రం ఏపీ బిషప్ కౌన్సిల్, తిరుపతి యునైటెడ్ క్రిస్టియన్ చర్చీస్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో శాంతి ర్యాలీ చేపట్టారు. ర్యాలీ రాజన్న పార్క్ వద్దనున్న తిరుపతి ఈస్ట్ మిషన్ కాంపౌండ్ చర్చి నుంచి భవానీనగర్ సర్కిల్, వీవీ మహల్ రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. బిషప్ కౌన్సిల్ చైర్మన్ ప్రవీణ్ మాట్లాడుతూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ నుంచి క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు మణిపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులతోపాటు భోజనం, వంట పాత్రలు అందించనున్నట్టు తెలిపారు. పాస్టర్ అరుల్ అరుసు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలోని బాధితులకు సాయం అందించేందుకు తన కుమారుడు జోయల్‌తో పాటు నలుగురు పాస్టర్లు శుక్రవారం మణిపూర్ వెళ్లనున్నట్టు వివరించారు. చర్చి పాస్టర్ పాల్‌రాజ్, పాస్టర్ నవీన్ లాజరస్, రుద్రపాల్, లక్ష్మీపతి, పీటర్, మోసెస్, తిమోతి, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై సిరుల తల్లి కటాక్షం



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూ పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలుచేపట్టారు. తదుపరి అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణ ముఖమండపంలో కనుల పండువగా కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అమ్మవారికి ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం అమ్మవారు గజ వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

మూలస్థానమ్మ హుండీ ఆదాయం రూ.9 లక్షలు

చంద్రగిరి (తిరుపతి రూరల్): చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి సుమారు రూ.9 లక్షల ఆదాయం వచ్చినట్టు చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆలయంలో బుధవారం తిరుపతి జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ కస్తూరి పర్యవేక్షణలో ఆలయ పాలకమండలి, చంద్రగిరి సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పోలీసులు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది హుండీలోని కానుకలను లెక్కించారు. మూడు నెలల్లో రూ.8,99,085 నగదు, 41.850 గ్రాముల బంగారం, 455.700 గ్రాముల వెండి లభించింది.

ఘనంగా ఎస్‌బీబీ మెడికేర్ స్టోర్ ప్రారంభం



ఎమ్మెల్యే భూమనను సత్కరిస్తున్న ఎస్‌బీబీ మెడికేర్ స్టోర్ చైర్మన్ కేవీ.చౌదరి

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం తిలక్ రోడ్డులో ఎస్‌బీబీ సంస్థ ఏర్పాటు చేసిన మెడికేర్ హోల్ సేల్ అండ్ రిటైల్ మెడికల్ స్టోర్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ముఖ్య అతిథులుగా హాజరై ఎస్‌బీబీ మెడికేర్ స్టోర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచడంపై స్టోర్ యజమాని కేవీ.చౌదరిని అభినందించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ డాక్టర్ల సేవలు ఎంత ముఖ్యమో రోగులు తీసుకుకునే మందులు అంతే ముఖ్యమన్నారు. ఎస్‌బీబీ మెడికేర్ సంస్థ చైర్మన్ కేవీ.చౌదరి మాట్లాడుతూ 20 శాతం డిస్కౌంట్‌తో ఫ్రీ డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తామన్నారు. డాక్టర్ రాసిన మందులను వాట్సాప్ ద్వారా తెలియజేస్తే సరఫరా చేస్తామని చెప్పారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం ఏరంగంపేట పంచాయతీ దుర్గం ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి బుధవారం ఎంపీటీసీ బోస్‌చంద్రారెడ్డి, సర్పంచ్ ఎర్రయ్య భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో భాగంగా ప్రభుత్వం రూ.16 లక్షలు కేటాయించిందన్నారు. ఇన్ని రోజులు అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉప సర్పంచ్ మోనిష్‌రెడ్డి, రామ్‌కుమార్, యశోదమ్మ, దేవరాజులు, చంద్రమౌళి రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వినోద్ కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఆరోగ్య సోపానాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు ఆరోగ్య సోపానాలని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి పట్టణం బాలుర, బాలికల, జేఆర్‌కేఆర్ పాఠశాలలు, బీడీ కాలనీ, మూలస్థానమ్మ ఆలయం వద్ద బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటిని ఆయన సర్పంచ్ రూప, అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, రామ్మూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, నాగరాజు, బండారి హేమచంద్రారెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో రమేష్ బాబు, రఫీ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి కల్చరల్: నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల బుధవారం వద్ద రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, రాష్ట్ర విభజన హామీలు సాధనే లక్ష్యంగా ఆర్ఎస్‌యూ ఏర్పడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఇన్‌చార్జ్ క్రిష్టారెడ్డి, రఘు, అశోక్ రెడ్డి, సుబ్బరాయుడు, రాజు పాల్గొన్నారు.

మునగ పెంపకంపై అవగాహన కల్పించాలి

రామచంద్రాపురం: రైతులు మునగ పెంపకం చేపట్టేలా అవగాహన కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం పాత కందులవారిపల్లి గ్రామంలోని ఒరవ కాలువ, రావిళ్లవారిపల్లి, సొరకాయలపాలెంలో ఫారంపాండ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.272 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఏపీఓ హంసవేణి పాల్గొన్నారు.